క్లుప్తంగా

నందిగామలో 2,03,322మంది ఓటర్లు

నందిగామ: నియోజకవర్గంలో ఓటరు తుది జాబితాను ఆర్డీవో పి.సాయిబాబు సోమవారం ప్రకటించారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,03,322 ఉన్నారు. పురుష ఓటర్లు 98,530మంది, మహిళా ఓటర్లు 1,04,784మంది, థర్డ్ జెండర్స్ ఓటర్లు ఎనిమిది మంది ఉన్నట్లు ఆర్డీవో వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందిగామ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. నందిగామ పట్టణవాసులు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని ఆయన కోరారు.పట్టణంలోని మెయిన్‌బజార్, గాంధీ సెంటర్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



నందిగామ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోందని చందాపురం ఎంపీ యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు అన్నారు. చందాపురం పాఠశాలలో ఎనిమిదోతరగతి చదువుతున్న 21మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి రూ.లక్ష విరాళం



జుజ్జూరు(వీరులపాడు): జుజ్జూరు గౌసియా జామియా మసీదు నిర్మాణానికి షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్‌బేగం రూ.లక్ష విరాళాన్ని మతగురువు రాయల్‌రాజాకు సోమవారం అందజేశారు. షహనాజ్ బేగం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకున్నంతలో గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అనంతరం మతపెద్దలు షహనాజ్ బేగంను ఘనంగా సత్కరించారు. మసీదు ప్రెసిడెంట్ చిన్న మీరాహుస్సేన్, మతపెద్దలు షేక్ ఖాజాపూర్, షేక్ నాగుల్‌మీరా, అనీఫ్, కాజా, మౌలాలి, తాజుద్దీన్‌బాబా, జయాలుద్దిన్, షేక్ ఫయాజ్ పాల్గొన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ



నందిగామ: రవాణాశాఖ నిబంధనలు పాటిస్తే, ప్రమాదాలను పూర్తిస్థాయిలో నిరోధించవచ్చునని నందిగామ రవాణాశాఖాధికారి పద్మావతి పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన గోడపత్రికలు, ప్రచార కరపత్రాలను సోమవారం ఆమె ఆవిష్కరించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆర్టీవో పద్మావతి మాట్లాడుతూ క్షేమంగా గమ్యం చేరుకోవడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని సూచించారు.వాహన తనిఖీ అధికారి ఎం.వి.ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్రా విజేతలు వీరే

వత్సవాయి : ఆడుదాం ఆంధ్ర వత్సవాయి మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను ఎంపీడీవో ఎం.రమేష్‌బాబు సోమవారం ప్రకటించారు. మండల స్థాయి బాలుర విభాగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీల్లో వత్సవాయి-2 జట్టు విజేతలుగా నిలువగా, క్రికెట్‌లో భీమవరం- 2జట్టు, బాలికల విభాగంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్‌లో మంగొల్లు-1 జట్టు, ఖోఖోలో వత్సవాయి-1 జట్టు, క్రికెట్‌లో దబ్బాకుపల్లి జట్టు విజేతలుగా నిలిచినట్లు వివరించారు. విజేతలుగా నిలిచిన జట్లు జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాయని ఎంపీడీవో తెలిపారు.

ముమ్మరంగా కులగణన సర్వే



కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. గండేపల్లిలో నిర్వహించిన సర్వేలో కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, వ్యవసాయ సహాయ అధికారి గోపీ, వలంటీర్ వాణి పాల్గొని గ్రామస్తుల వివరాలను నమోదు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట:మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల పరిధిలో చేపట్టిన కులగణన సర్వేను చురుగ్గా కొనసాగుతోంది. వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల కుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

జగ్గయ్యపేట అర్బన్: అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని అంతటా రామనామస్మరణే వినిపించింది. జగ్గయ్యపేట పట్టణంలోపాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శోభాయాత్రలు, కోలాటాలతో అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇళ్లపై శ్రీరాముడి జెండాలను ఎగురవేసిన రామభక్తులు జైరామ్ నినాదాలు చేశారు.

వైభవంగా శోభాయాత్ర..

అయోధ్యలో రామమందిరం, రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో రావిరాలలోని శ్రీసీతారామస్వామి వార్ల శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పద్మావతినగర్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించిన కోలాట నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విప్ ఉదయభానుతోపాటు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్ద రామాలయంలో ప్రత్యేక పూజలు..

పట్టణంలోని శ్రీధనశైల సీతారామస్వామి దేవస్థానం(పెద్ద రామాలయం)లో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళా భక్త బృందంతో కలసి రామనామ స్మరణ చేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ధర్మకర్త, సచివాలయాల పట్టణ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, శ్రీతిరుపతమ్మ దేవస్థానం, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్లు జంగాల శ్రీనివాసరావు, కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు..

అయోధ్యలో నిర్వహించే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విప్ ఉదయభాను ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటుచేశారు. వేదికపై సీతారాముల వారి చిత్రపటాలను ఉంచి విప్ ఉదయభాను, ఆయన సతీమణి విమలాభాను ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ ఆర్. రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఆకుల శ్రీకాంత్, శ్రీతిరుపతమ్మ, తిరుమలగిరి దేవస్థానాల చైర్మన్లు జంగాల శ్రీనివాసరావు, కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, కౌన్సిలర్లు, నాయకులు, పెద్దసంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు.



గురుధాంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

రామాయణ ఇతిహాస ఘట్టాల ప్రదర్శన ..

అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు రామాయణంలోని ఇతిహాస ఘట్టాలను నాటికరూపంలో ప్రదర్శించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బుస్సు సురేష్, కరస్పాండెంట్ సరిత, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక వెంకట సన్నీ హాస్పిటల్ బృందం సభ్యులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను, భక్తులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం నందిగామ నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ పండుగ వాతావరణం కనిపించింది. నందిగామతోపాటు మండలంలోని ప్రతి గ్రామంలో శోభాయాత్రలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు అయోధ్య రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలో వందలాదిమందితో శోభాయాత్ర నిర్వహించారు. మెయిన్‌బజార్‌లో శ్రీరామయాగం, సీతారాముల కల్యాణ మహోత్సవం, పుష్పయాగం, దీపోత్సవం నిర్వహించడంతోపాటు అన్నదానం చేశారు. శివాలయం సెంటర్, గాంధీసెంటర్‌లో స్వామివారి ప్రతిష్ఠా కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం భారీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పానకం పంపిణీ చేశారు. రాఘవాపురం భక్తాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, శ్రీరామ పట్టాభిషేక పూజ, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, రామభక్తులు

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: ఆయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం గ్రామాల్లో రామనామం మార్మోగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు రాముడి జెండాలు చేబూని జైశ్రీరామ్ నినాదాలతో వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెనుగంచిప్రోలులో శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో పడమట బజారులోని కోదండ రామాలయం వద్ద నుంచి మహిళలు 108కలశాలతో తూర్పుబజారు రామాలయం వద్దకు శోభాయాత్ర చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. రాత్రికి గృహాల ముందు ప్రత్యేకంగా ప్రమిదలు వెలిగించి దీపోత్సవం నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట:అయోధ్యలో రాములల్లా ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని జగ్గయ్యపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. గండ్రాయిలోని సీతారామ స్వామివారి ఆలయంలో శ్రీసీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వైష్ణవి, గ్రామస్తులు పాల్గొన్నారు. బూదవాడలో సీతారామ ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. రాత్రి సమయంలో ఇళ్లముందు ప్రమిదలు వెలిగించి పూజలు చేశారు. బలుసుపాడులోని గురుధాం ఆశ్రమంలో తాత్వికుడు గెంటేల వెంకటరమణ దంపతులచే నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయ పరబ్రహ్మ విగ్రహ ఆవిష్కరణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆంజనేయునికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : అయోధ్యలో రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కంచికచర్ల మండలంలోని గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్లలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవి యువసేన ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏకరామ పారాయణ కార్యక్రమం జరిగింది. రామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు.



నందిగామలో శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పరిటాల, గొట్టుముక్కలలో..

మండలంలోని పరిటాల, గొట్టుముక్కలలో స్వామీజీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాముని చరిత్ర గురించి వివరించారు. అనంతరం పలు గ్రామాల మీదుగా జై శ్రీరాం అంటూ భారీఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని వత్సవాయి మండలంలోని అన్ని గ్రామాలు రామనామస్మరణతో మార్మోగాయి. రామాలయాల వద్ద పెద్ద స్క్రీన్లను ఏర్పాటుచేసి బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేశారు. ప్రధానసెంటర్లలో జెండాలతో తోరణాలు కట్టారు. యువకులు బైకులకు రాములవారి జెండాలను కట్టుకుని ర్యాలీలు చేశారు.



పద్మావతినగర్‌లో కోలాట ప్రదర్శన



పెనుగంచిప్రోలులో బైక్‌ర్యాలీ చేస్తున్న రామభక్తులు



కంచికచర్లలో అన్నదానం చేస్తున్న వాసవి యువసేన నాయకులు



రాఘవాపురంలో కుంకుమపూజలు చేస్తున్న భక్తులు

రూ.1.32కోట్లతో పైపులైన్ పనుల ప్రారంభం

చందర్లపాడు(నందిగామ టౌన్): జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీటిని అందిస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని పోపూరులో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.1.32 కోట్లతో చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పోపూరు గ్రామంలో రూ.29 లక్షలతో ఎస్సీ కాలనీలో రూ.55.80లక్షలు, న్యూ పోపూరులో రూ.47.10 లక్షలతో పైప్‌లైన్, వాటర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైప్‌లైన్, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, చింతోటి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.



పోపూరులో పైపులైన్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

పార్థీనియంపై రైతులకు అవగాహన

పోచంపల్లి(జగ్గయ్యపేట):జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పోచంపల్లి రైతులకు సోమవారం పార్థీనియం(వయ్యారిభామ మొక్కలు)నిర్మూలనపై అవగాహన కల్పించారు. వయ్యారిభామ మొక్కల కారణంగా చర్మ వ్యాధులు వస్తాయని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేకాధికారి విజయ్‌ప్రకాష్, బాలమురళీధర్, హెచ్ఎం ఉదయభాను, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట నుంచి గండ్రాయి వరకు రూ. 2కోట్లతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ షేర్‌మహ్మద్‌పేట నుంచి గండ్రాయి వెళ్లే ఐదుకిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండి కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందిపడుతుండటంతో సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు మరమ్మతులకు రూ.2కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్నిరోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగ్గయ్యపేట రోడ్డును రూ.14కోట్లతో నాలుగులేన్ల రోడ్డుగా అభివృద్ధి చేశామని, రూ.1.50కోట్లతో పెనుగంచిప్రోలు-వేమవరం రోడ్డు పనులు చేపడుతున్నామని వివరించారు. ఆర్‌అండ్‌బీ జేఈ నరేంద్ర, నాయకులు సతీష్, చలమల శ్రీనివాస్, మోరే వినోద్, ఆదినారాయణ, సుశీల పాల్గొన్నారు.



గండ్రాయి వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న విప్ సామినేని ఉదయభాను

ఘనంగా ఎంపీ కేశినేని జన్మదిన వేడుకలు

నందిగామ టౌన్: విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో కేశినేని శ్రీనివాస్ (నాని) కృషి మరువలేనిదని నందిగామ ఎమ్మెల్యేమొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేశినేని జన్మదిన కేక్‌ను కట్‌చేసి ఫోన్‌ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ కేశినేని నాని పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించారన్నారు. అభివృద్ధికి, ప్రజలకు మంచి చేయడానికి పార్టీలతో సంబంధం లేదని ముక్కుసూటిగా చెప్పిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజలకు మంచిచేస్తున్న వైఎస్సార్ సీపీకి ఆయన కూడా మద్దతుగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, నాయకులు పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, వైఎస్ఎన్ ప్రసాద్, మంచాల చంద్రశేఖర్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మందా మరియమ్మ, దాసు, బాపట్ల సాంబయ్య, మార్త శ్రీను, ఓర్సు జ్వాలా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పేట ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కృషి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి సుందరీకరణలో భాగంగా ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద రూ.13 లక్షలతో నిర్మించిన వాటర్ ఫౌంటెయిన్‌ను ప్రభుత్వ విప్ ఉదయభాను సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ పేట ప్రభుత్వాసుపత్రి అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే ఆస్పత్రిని రూ.3కోట్లతో ఆధునీకరించినట్లు చెప్పారు. ఆస్పత్రిలో పడకల సంఖ్యను 30నుంచి 50కి పెంచామన్నారు. గతంలో నలుగురు మాత్రమే వైద్యులు ఉండగా, నేడు 11మంది వైద్యులు ఉన్నారని వివరించారు. ఇటీవల రూ.30లక్షలతో ఆస్పత్రి ఇన్, ఔట్ గేట్ల నిర్మాణం, ఆస్పత్రి ఆవరణలో సీసీరోడ్లు, క్యాంటీన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, నందిగామ ఆర్డీవో సాయిబాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఆకుల బాజీ, కౌన్సిలర్లు పందుల రోశయ్య, వట్టెం మనోహర్, ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



వాటర్ ఫౌంటెయిన్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

గండేపల్లి(కంచికచర్ల): నందిగామ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు తనను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కోరారు. మండలంలోని గండేపల్లిలో సోమవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. ఆయా పథకాల లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొక్కా రవి కుమార్, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచి బి.సుబ్బారావు, నాయకులు కృష్ణా రంగారావు, సుంకు బాలాజీ, తలమాల కిషోర్, సంగం దేవరాజ్, బొక్కా శ్రీనివాసరావు, మార్కపూడి మధుబాబు, శ్రీరాం మల్లికార్జునరావు, నెలకుదిటి శివనాగమల్లేశ్వరరావు, మార్త శ్రీనివాసరావు, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గండేపల్లిలో ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

నందిగామలో ప్రగతి యూనిట్ ప్రారంభం..

నందిగామ టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రగతి యూనిట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఒక్కో ప్రగతి యూనిట్‌కు సగటున రూ.2.50 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేసేలా కార్యాచరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, మాడుగుల మనోహర్, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరులపాడు: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిని సాధించాలని ఐఎఫ్ఎస్ అధికారి మోనాలిసాదాస్ సూచించారు. పొన్నవరంలో వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం ఆమె ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, సర్పంచి షోడగిరి రాజశ్రీ, డీపీవో జయచంద్ర, అడిషనల్ డీఎంహెచ్‌వో ఉషారాణి, ఆయుష్మాన్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ సుమన్, ఏడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీవో అరుంధతీదేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న మోనాలిసాదాస్

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఎన్ఎస్‌పీకాలనీలోని 14వ సచివాలయం వద్ద సోమవారం వికసిత్ భారత సంకల్పయాత్రను నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

25న పాలకవర్గ ప్రమాణ స్వీకారం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు సోమవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10.09 గంటలకు నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంతోపాటు చైర్మన్‌గా ఎన్నికైన కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

విజేతలకు బహుమతులు

పెనుగంచిప్రోలు: ఆడుదాం..ఆంధ్రా క్రీడాపోటీల్లో మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ఎంపీపీ మార్కపూడి గాంధీ సోమవారం బహుమతులు అందజేశారు. మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్షసాయి, కొణకంచి సర్పంచ్ గోనెల దేవి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, పశు వైద్యాధికారి పి.అనిల్, పీడీ వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు బోరు మోటార్లు పంపిణీ



పెనుగంచిప్రోలు: మండలంలోని 17మంది రైతులకు వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన బోరు మోటార్లను ఎంపీపీ మార్కపూడి గాంధీ సోమవారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్షసాయి, కొణకంచి, కొళ్లికూళ్ల సర్పంచ్‌లు గోనెల దేవి, జొన్నలగడ్డ కిషోర్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏపీవో తిరుపతయ్య పాల్గొన్నారు.